ఎమ్మెల్సీగా బసనగౌడ బాదర్లి ఏకగ్రీవం



బెంగళూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): శాసనసభ్యుల కోటాలో ఒక స్థానానికి జరిగిన ఎన్నికల ప్రక్రియలో బసనగౌడ బాదర్లి ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు శాసనసభ కార్యదర్శి విశాలాక్షి ప్రకటించారు. బుధవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బసనగౌడ బాదర్లి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. ఇతరులు ఎవరూ పోటీలో లేకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్టు వెల్లడించారు. ఆయన మూడు సెట్లు నామినేషన్ దాఖలు చేసిన విషయాన్ని వివరించారు.

అభయారణ్యం పేరుతో అడ్డంకులు



కణకుంబి గ్రామ సమీపంలోని చిగులె జలపాతం

నిత్యం అడవిలో మేతకు పశువులు
పులులు ఉన్నట్లు తెరపైకి తెచ్చిన గోవా, మహారాష్ట్ర
మహదాయి ప్రాజెక్టుకు అభ్యంతరాలు

బెంగళూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అదో కారడవి... చుట్టూ జలపాతాలు, సెలయేళ్లు. వీటి నడుమ వన్యప్రాణులు, పక్షుల కిలకిలారావాలు. కానీ ఈ ప్రాంతం రికార్డుల పరంగా పులుల అభయారణ్యంగా ఉంది. ఇక్కడ పులులు కనిపించవు. ఆవుల సామ్రాజ్యమే ఉంటుంది. అటువంటి విచిత్రమైన విధానం హుబ్బళ్లి - ధారవాడకు అనుబంధంగా ఉండే పశ్చిమకనుమల ప్రాంతంలో ఉంది. పులుల అభయారణ్యంగా చెబుతున్న ప్రదేశంలో సమీప గ్రామాలకు చెందిన రైతులు తాము పెంచుతున్న ఆవులతోపాటు ఇతరత్రా పశువులను ఎటువంటి ఆటంకం లేకుండా మేతకోసం అడవులలోకి వదులుతారు. కొందరు పశుపెంపకందారులు ఉదయం నుంచి సాయంత్రం దాకా అటవీ ప్రాంతంలోనే ఉండి తిరిగి వస్తారు. ఇది కేవలం కొన్ని నెలలకాలంగా సాగుతున్న తంతు కాదు. కొన్నేళ్లుగా అమలులో ఉన్న విధానమే. ఇక్కడి రైతులు పులుల అభయారణ్యంగా పిలిచే ప్రాంతంలో ప్రవహించే చోర్ల, హళతార కాలువల చెంతకు వెళ్తుంటారు. కాలువలలో నిరంతరంగా నీరు ప్రవహిస్తుండడం ద్వారా పశుగ్రాసం పెరుగుతోంది. ఇలా దశాబ్దాలకాలంగా రైతులు ఆవులను మేతకు వదులుతున్నారు. ఇప్పటి వరకు తాము పులిని చూడలేదని, ఆవులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదని కణకుంబి గ్రామానికి చెందిన రైతు అనిల్ తెలిపారు. ఆవులు మేతకు వెళ్లకుండా అడ్డుకునేందుకే పులుల కారిడార్, తాగునీటిని సమకూర్చాలనే మహదాయి ప్రాజెక్టుకు అడ్డంకిగా మారింది. గోవా, మహారాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నట్టుగా ఈ ప్రాంతంలో పులుల అభయారణ్యమే లేదు. పులులు ఉన్నట్టు రికార్డులు లేవు. మహదాయి ప్రాజెక్టును అడ్డుకునేందుకే పులుల అభయారణ్యం అంశాన్ని తెరపైకి తీసుకొచ్చినట్టుగా ఉందని మహదాయి, కళసా బండూరి పోరాట రైతులు అంటున్నారు. కర్ణాటక మహదాయి ప్రాజెక్టు పులుల కారిడార్ పరిధిలోకి రాదు. ముంబై హైకోర్టు ఆదేశాలను అధ్యయనం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తామని న్యాయవాదులు చెబుతున్నారు. రాష్ట్రంలో పుట్టి ప్రవహించే కళసా, బండూరితోపాటు ఆరు కాలువలు ఉండే ప్రదేశంలో ఒక్క పులి సంచారం కూడా లేదని మహదాయి పోరాట సమితి అధ్యక్షుడు విజయకులకర్ణి పేర్కొన్నారు. పశ్చిమకనుమల నుంచి ఉత్తరకన్నడ జిల్లా కాళి పులుల అభయారణ్యం ద్వారా కేరళవైపు పులులు వెళ్తాయని చెబుతున్నారు. రాష్ట్రంలో మహదాయి ప్రదేశంలో ఎటువంటి పులుల అభయారణ్యం లేదని, మహదాయిని అడ్డుకునే ఉద్దేశ్యంతోనే అధికారులు సృష్టించిన కథలు అని కర్ణాటక రైతు సమితి అధ్యక్షుడు వీరేశ్ సోబరదమఠ తెలిపారు. కణకుంబి ప్రదేశంలో ఆవుల మేతకు వెళ్తున్నట్టు సాక్ష్యాలు ఉన్నాయని, ఇప్పటికైనా కేంద్ర వన్యజీవుల మండలి వాస్తవ స్థితిగతులను పరిశీలించి మహదాయి ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వాలని కోరారు.

గోవా అభ్యంతరం

మహదాయి ప్రదేశం వన్యజీవుల అభయారణ్యంగాను, పులుల సంరక్షణా ప్రదేశంగాను గతంలో గోవా ప్రభుత్వం నిరాకరించింది. గోవాకు చెందిన పర్యాటక నిపుణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పులుల సంరక్షణా ప్రదేశంగా ప్రకటిస్తే మహదాయి ప్రాజెక్టును అడ్డుకోవచ్చునని అభిప్రాయపడుతున్నారు. గోవా ఫౌండేషన్ దాఖలు చేసిన పిల్‌ను విచారణ జరిపిన ముంబై హైకోర్టులోని గోవా బెంచ్ గోవా రాష్ట్ర ప్రభుత్వానికి మహదాయి ప్రదేశాన్ని వన్యజీవుల అభయారణ్యంగాను, పులుల సంరక్షణా ప్రదేశంగా ప్రకటించాలని సూచించింది. ఇదే విషయమై సుప్రీంకోర్టులో వాదిస్తామని గోవా ప్రభుత్వం ప్రకటించింది.

సీఎం నివాసం ముట్టడికి
బీజేపీ యత్నం

వాల్మీకి కార్పొరేషన్‌లో అవినీతిపై నిరసన
ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
విజయేంద్ర, అశోక్ సహ పలువురు నేతల అరెస్ట్



బీజేపీ నేతలను వాహనాల్లో తరలిస్తున్న పోలీసులు



పోలీసుల అదుపులో సునీల్‌కుమార్

బెంగళూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయల అవినీతికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాజీనామా చేయాలని బీజేపీ నిరసన చేపట్టింది. బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత అశోక్ నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలతోపాటు పెద్ద ఎత్తున నాయకులు సీఎం అధికారిక నివాసం కావేరి ముట్టడికి ప్రయత్నించారు. కుమారకృప అతిథి గృహం నుంచి ర్యాలీగా బయల్దేరారు. రోడ్డుపైకి చేరుకోగానే పోలీసులు అడ్డుకున్నారు. బీజేపీ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఒకానొక దశలో తోపులాట జరిగింది. విజయేంద్ర, అశోక్, సునిల్‌కుమార్‌తోపాటు నాయకులందరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ ఉత్తమ పాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో రోజుకో అవినీతి బయటకు వస్తోందన్నారు. వాల్మీకి కార్పొరేషన్‌లో రూ.187 కోట్ల అవినీతి జరిగిందన్నారు. బాధ్యుడిగా మంత్రి నాగేంద్ర చేత రాజీనామా చేయించారని అన్నారు. ఇప్పటివరకు నాగేంద్రను విచారణకు పిలవలేదని పేర్కొన్నారు. కోట్ల రూపాయల రాష్ట్ర సొమ్మును లోక్‌సభ ఎన్నికల కోసం ఇతర రాష్ట్రాలకు పంపించారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీమంత్రిని ఎందుకు విచారణ జరపలేదని ప్రశ్నించారు. మరోవైపు మైసూరు ముడా అక్రమం వెలుగులోకి వచ్చిందన్నారు. అవినీతికి సంబంధించి నగరాభివృద్ధిశాఖ మంత్రి బైరతి సురేశ్‌కు ఏడు నెలల కిందటే జిల్లా అధికారి నివేదిక ఇచ్చారని, మంత్రి ఎవరి దృష్టికి తీసుకురాకుండా దాచి పెట్టారన్నారు. అవినీతిపరులను రక్షించే ప్రయత్నం జరిగిందన్నారు. రెండు రోజుల కిందట మైసూరులో సమావేశం నిర్వహించిన మంత్రి ఉన్నపళంగా నలుగురు అధికారులను ఎందుకు బదిలీ చేసినట్టు అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి భార్యకు 15 స్థలాలను ఇచ్చారన్నారు. మంత్రి మైసూరు నుంచి అవినీతికి సంబంధించిన ఫైళ్లను బెంగళూరుకు తీసుకొచ్చారని అన్నారు. మొత్తం అవినీతిని మూసివేసే కుట్ర జరుగుతోందన్నారు. కాగా అందరినీ అరెస్టు చేసిన పోలీసులు అక్కడి నుంచి తరలించారు.



ప్రతిపక్షనేత అశోక్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

భారీగా ఐపీఎస్‌ల బదిలీలు


బెంగళూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాలనాపరంగా పోలీసు విభాగంలో బుధవారం భారీస్థాయిలో బదిలీలు చేసింది. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగియగానే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బెంగళూరు సెంట్రల్ ఐజీగా లాబూరాంను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మైసూరు నగర కమిషనర్ రమేశ్‌బానూత్‌ను దావణగెరె డీఐజీగా బదిలీ చేసింది. రవికాంతేగౌడను ఐజీ హెడ్ క్వార్టర్స్‌కు, త్యాగరాజన్‌ను ఐజీ ఇంటర్నల్ సెక్యూరిటీ విభాగానికి, శశికుమార్‌ను హుబ్బళ్లి - ధారవాడ కమిషనర్‌గా బదిలీ చేసింది. మైసూరు కమిషనర్‌గా తొలి మహిళా అధికారిగా సీమా లాట్కర్‌ను నియమించింది. రేణుకా కె.సుకుమార్‌ను ఏజీపీ క్రైం హెడ్ క్వార్టర్స్‌కు, సీకే బాబాను బెంగళూరు గ్రామీణ ఎస్పీగా, విష్ణువర్ధన్‌ను మైసూరు ఎస్పీగా, సుమన్ డి. పర్నేకర్‌ను బీఎంటీఎఫ్ ఎస్పీగాను, రిష్యంత్‌ను వైర్‌లెస్ ఎస్పీగాను, చెన్నబసవణ్ణ లంగోటిని అడ్మినిస్ట్రేటివ్ ఏజీపీగా, నారాయణను ఉత్తరకన్నడ ఎస్పీగా, సరా ఫాతిమాను ఆగ్నేయ విభాగం డీసీపీగా, అరుణాంక్షు గిరిని సీఐడీ ఎస్పీగా, నాగేశ్‌ను డీసీపీ ఆర్మ్‌డ్ రిజర్వు విభాగానికి, పద్మిని సాహూను అడ్మినిస్ట్రేషన్ డీసీపీగాను, ప్రదీప్‌గుంటిని బీదర్ ఎస్పీగాను, యతీశ్‌ను దక్షిణకన్నడ ఎస్పీగా, మల్లికార్జున బాలదండిని మండ్య ఎస్పీగా, డాక్టర్ శోభారాణిని బళ్లారి ఎస్పీగా, డాక్టర్ కవితాను చామరాజనగర్ ఎస్పీగా, నిఖిల్‌ను కోలారు ఎస్పీగా, కుశాల్ చౌక్సీను చిక్కబళ్లాపుర ఎస్పీగా, మహానింగి నందగన్విని హుబ్బళ్లి - ధారావాడ లా అండ్ ఆర్డర్ డీసీపీగా ప్రభుత్వం బదిలీ చేసింది.

మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డికి ఊరట

మూడేళ్ల జైలు శిక్ష రద్దు... హైకోర్టు తీర్పు
హోసూరులో అన్నాడీఎంకే కార్యకర్తల సంబరాలు



బాలకృష్ణారెడ్డి



హోసూరు, జూలై 3: ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించేలా అల్లర్లకు పాల్పడ్డారనే నేరారోపణలను ఎదుర్కొంటున్న అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డికి ఊరట లభించింది. ఈ వ్యవహారంలో ఆయనకు ప్రత్యేక కోర్టు విధించిన మూడేళ్ల జైలు శిక్షను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. ప్రత్యేక కోర్టు జైలు శిక్ష విధించడంతో అప్పట్లో క్రీడాశాఖ మంత్రిగా పనిచేసిన బాలకృష్ణారెడ్డి మంత్రి పదవితో పాటు శాసనసభ్యత్వాన్ని సైతం కోల్పోయిన విషయం తెలిసిందే. 1998 సంవత్సరం హోసూరు సమీపంలోని బాగలూరులో అన్నాడీఎంకే నిర్వహించిన ఆందోళన సందర్భంగా జరిగిన బస్సులపై రాళ్ల దాడి సంఘటనకు సంబంధించి బాలకృష్ణారెడ్డి సహా 108 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును ఎంపీలు, ఎమ్మెల్యేల నేరాలపై విచారణ జరిపే ప్రత్యేకకోర్టు విచారణ జరిపింది. బాలకృష్ణారెడ్డి సహా 16 మందిని దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో బాలకృష్ణారెడ్డికి మూడేళ్ల జైలు విధిస్తూ ప్రత్యేక కోర్టు 2019 జనవరి 7న తీర్పునిచ్చింది. జైలు శిక్షపడటంతో బాలకృష్ణారెడ్డి మంత్రి పదవితో పాటు శాసనసభ్యత్వాన్ని ఒకేసారి కోల్పోయారు. ఆ నేపథ్యంలో ప్రత్యేకకోర్టు విధించిన తీర్పును సవాలు చేస్తూ బాలకృష్ణారెడ్డి సహా 16 మంది హైకోర్టులో అప్పీలు చేసుకున్నారు. ఈ అప్పీళ్లపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయచంద్రన్ విచారణ జరిపారు. ప్రభుత్వ తరఫు, పిటిషనర్ల తరపు వాద ప్రతివాదనలు ముగియటంతో న్యాయమూర్తి బుధవారం తీర్పు వెలువరించారు. బాగలూరులో జరిగిన అల్లర్లకు సంబంధించి పోలీసుల విచారణ లోపభూయిష్టంగా వుందని, నిజానికి ఆందోళనలో పాల్గొన్నవారిని సక్రమంగా గుర్తించలేకపోయారన్నారు. ఈ కేసులో పోలీసుల తరపు వాదనలన్నీ చాలా బలహీనమైనవిగానే ఉన్నాయని, ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని బాలకృష్ణారెడ్డికి ప్రత్యేక కోర్టు విధించిన జైలు శిక్షను రద్దు చేస్తున్నట్లు న్యాయమూర్తి జయచంద్రన్ పేర్కొన్నారు.

హోసూరులో సంబరాలు

అన్నాడీఎంకే కృష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డికి కోర్టులో ఊరట లభించడంతో హోసూరులో ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు సంబరాలు చేసుకున్నారు. హోసూరు, బాగలూరులో అన్నాడీఎంకే సభ్యులు టపాసులు పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. సంబరాల్లో పార్టీ హోసూరు ప్రాంత కార్యదర్శులు వాసుదేవన్, అశోక్‌రెడ్డి, మంజు, సంయుక్త కార్యదర్శి రవికుమార్, జిల్లా కార్యదర్శి చిట్టి జగదీశ్, కార్యదర్శి రాము, డ్రైవర్ల బృందం జిల్లా కార్యదర్శి చెన్నయ్య, సాహిత్య బృందం జిల్లా కార్యదర్శి కృష్ణన్, హోసూరు మున్సిపల్ విద్యాకమిటీ చైర్మన్ శ్రీధరన్, హోసూరు కౌన్సిలర్లు కుబేరన్, శివరామన్, సర్కిల్ కార్యదర్శులు లక్ష్మీ హేమకుమార్, శివకుమార్, హరి, హోసూరు మాజీ నగర కౌన్సిలర్లు నారాయణరెడ్డి నందకుమార్, శక్తివేల్, సంయుక్త ఉప కార్యదర్శి రమేశ్, హోసూరు యూనియన్ కమిటీ సభ్యులు మునిరత్నం మునిరాజ్, ఉమా గుణశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



బాలకృష్ణారెడ్డికి మిఠాయి తినిపిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

శ్రీకాశి సేవలో

కర్ణాటక మంత్రి



కర్ణాటక మంత్రికి స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

కదిరి, జూలై 3: శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ని కర్ణాటక పౌరసరఫరాల శాఖ మంత్రి కేహెచ్ మునియ్యప్ప బుధవారం దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు స్వామివారి చిత్రపటాన్ని అందించి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నా కోసం మద్దతు ఇవ్వండి

- చెన్నపట్టణ నుంచి పోటీ చేయను
- ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): చెన్నపట్టణ శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని, తనకోసం తమ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ కోరారు. వరుసగా మూడోరోజు చెన్నపట్టణ పర్యటనలో భాగంగా బుధవారం ఇంటి ముంగిటకే ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా డీకే మాట్లాడుతూ చెన్నపట్టణకు తానే మంత్రి, తానే ఉపముఖ్యమంత్రి అన్నారు. ఎమ్మెల్యేలు ఉదయ్, ఇక్బాల్‌హుసేన్, ఎమ్మెల్సీలు పుట్టణ్ణ, ఎస్ రవితోపాటు జిల్లా అధికారి అవినాశ్, ఎస్పీ కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. చెన్నపట్టణ రానున్న రోజుల్లో బెంగళూరులో చేరిపోతుందన్నారు. మనం ఎక్కడివారమనేది పాఠ్యపుస్తకాల్లో పరిశీలించుకోవచ్చు అన్నారు. హొసకోటె, దేవనహళ్లి, మాగడి, కనకపుర, బెంగళూరు ప్రాంతాలే అన్నారు. రామనగర, చెన్నపట్టణలను జంట నగరాలుగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చిన కుమారస్వామి రెండుసార్లు సీఎం అయినా సాధ్యం చేయలేదన్నారు. విమర్శలు సమసిపోతాయని, చేసిన పనులు శాశ్వతమని అన్నారు. చెన్నపట్టణలో 9 ప్రాంతాల్లో జనస్పందన చేపట్టానని వివరించారు. కనకపుర తరహాలో ఇక్కడా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సభ జరుగుతుండగానే వర్షం కురవగా మనకు వరుణుడు ఆశీర్వాదం చేస్తున్నాడని, తమిళనాడు వాసుల నీటి డిమాండ్ చేస్తుంటారని, ఎక్కువ వర్షం కురిస్తే సమస్యలు ఉండవని అన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీసీఎం డీకే శివకుమార్



సీఎం సిద్దరామయ్యను కలిసిన షర్మిల

సీఎంతో షర్మిల భేటీ

బెంగళూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం రాత్రి ముఖ్యమంత్రి సిద్దరామయ్యను భేటీ అయ్యారు. సీఎం అధికారిక నివాసంలో కలిశారు. షర్మిల సీఎంకు పుష్పగుచ్ఛాన్ని అందించారు. అనంతరం తాజా రాజకీయాలపై ఇద్దరూ చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓట్ల శాతం పెరిగిందని షర్మిల వివరించినట్టు సమాచారం.

కృష్ణానదిలో మూడు మృతదేహాలు వెలికితీత

బెంగళూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేయగా తప్పించుకునే ప్రయత్నంలో కృష్ణా నదిలో తెప్పద్వారా వెళ్లి ప్రమాదానికి గురైన ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. విజయపుర జిల్లా కొల్హార సమీపంలో ప్రవహిస్తున్న కృష్ణానదిలో తెప్ప మునిగిన ప్రమాదంలో గల్లంతయ్యారు. మంగళవారం సాయంత్రం ఇద్దరి మృతదేహాలు లభించాయి. పుండలీక ఎంకంచి, తయ్యాబ్ చౌదరి మృతదేహాలు లభించాయి. బుధవారం దశరథగౌడర్ (54) మృతదేహాన్ని వెలికితీశారు. పేకాట ఆడుతుండగా పోలీసులను చూసి గుంపుగా ఉండేవారంతా తప్పించుకునే ప్రయత్నం చేశారు. వీరిలో నదిలోకి దూకిన కాసేపటికి సచిన్, ఫరూక్ ఈత కొడుతూ ఒడ్డుకు చేరారు. ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. రఫీక్ జాలగార, మహబూబ్ వాలికార్ ఆచూకీ తెలియరాలేదు. జిల్లా ఎస్పీ రుషికేశ్ సోనావన సంఘటనా స్థలాన్ని సందర్శించారు. రంగంలోకి గజ ఈతగాళ్లను దించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,587.11	1,576.50
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	10503	190
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	296	260
సామర్థ్యం (టీఎంసీలు)	8.78	3.00

మెలమెల్లగా తుంగభద్ర పరవళ్లు

● ఊరిస్తున్న కారుమేఘాలు..
● ఆగి ఆగి కురుస్తున్న వానలు...

బళ్లారి గాంధీనగర్, జూలై 3:
తుంగభద్ర ఎగువ ప్రాంతాల్లో ఆగి..ఆగి కురుస్తున్న వానల కారణంగా తుంగభద్రకు వరద నీరు మెలమెల్లగా చేరుకుంటోంది. కారుమేఘాలు ఊరిస్తున్నా... అనుకున్న స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో ఆయకట్టు రైతుల ఆశలు సన్నగిల్లే పరిస్థితి నెలకొంది. పడమటి కనుమల్లో విస్తారంగా వర్షాలు కురిస్తేనే తుంగభద్రకు వరద నీరు వస్తుంది. తుంగ, భద్ర నదులు పరుగులు దీస్తేనే కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల రైతుకు జీవం వస్తుంది. తుంగభద్ర కళకళలాడకుంటే ఈ ప్రాంత ఆయకట్టు రైతులు విలవిలాడాల్సి వస్తుంది. పది రోజుల క్రితం జలాశయానికి వెయ్యి క్యూసెక్కులకు పైగా నీరు చేరుతుండడంతో ఇంకేమిటిలే అనుకున్న రైతులకు రెండుమూడు రోజుల్లో ఇన్‌ఫ్లో మూడు అంకెలకు పడిపోవడంతో వారిలో కంగారు మొదలైంది. ప్రస్తుతం జలాశయం పైభాగంలో కురుస్తున్న వర్షాల కారణంగా జలాశయానికి వరద మెలమెల్లగా పెరుగుతోంది. జలాశయానికి 10,503 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ప్రస్తుతం నీటిమట్టం 1,587.11 అడుగులకు చేరగా, జలాశయంలో 8.78టిఎంసిల నీరు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

సాగుకు సమాయత్తం అవుతున్న రైతులు

బళ్లారి, జూలై 3(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం కింద కర్ణాటకలోని బళ్లారి, రాయచూరు, కొప్పళ్, ఏపీలోని అనంతపురం, కర్నూలు కడప జిల్లాల పరిధిలో సుమారు 12లక్షల ఎకరాలు సాగవుతుంది. రబీలో 6లక్షల హెక్టార్లు సాగవుతుంది. దీనిప్రకారం మొత్తం 22 లక్షల హెక్టార్ల ఆయకట్టుకు జీవనాడిగా తుంగభద్ర డ్యాం నిలుస్తుంది. కర్ణాటక, ఆంధ్రలోని అనేక గ్రామాలకు తాగునీటి సరఫరాతో పాటు జిందాల్, ఇతర పరిశ్రమలకు అవసరమైన నీటిని కూడా తుంగభద్ర నుంచే సరఫరా చేస్తున్నారు.

గత సంవత్సరం నీటి అంచనాల ప్రకారం తుంగభద్ర డ్యాంకు తగినంత నీరు చేరలేదు.



వరదనీటితో జలకళ సంతరించుకున్న తుంగభద్ర జలాశయం

ఎలాగోలా ఖరీఫ్ సాగు పూర్తయినా రబీ సాగు మాత్రం ముందుకు సాగలేదు. వర్షాభావం కారణంగా జలాశయం నుండి తాగునీరు కూడా చాలా గ్రామాలకు చేరలేదు. అయితే గతేడాది తుంగభద్ర మిగిల్చిన కన్నీటిని రైతులు దిగమింగుకుని ఈ ఏడాది ఆశతో మళ్లీ సాగుకు నడుం కట్టారు. తుంగభద్రకు ప్రస్తుతం 9 టీఎంసీలు నీరు చేరింది. ఇన్‌ఫ్లోకూడా క్రమేపీ పెరుగుతోంది.

ఆషాఢ శుద్ధ ఏకాదశి అంటే తొలిఏకాదశి నాటికి తుంగభద్రమ్మ నిండి పొంగిపొర్లుతుందని, సాగుకు ఢోకాఉండదని రైతులు భావిస్తున్నారు. ఈఏడాది సమృద్ధిగా నీరు చేరుతుందనే ఆశతో రైతులు ఖరీఫ్ సాగుకు ముందుకు సాగుతున్నారు.

జిల్లా తొలి మహిళా ఎస్పీగా శోభారాణి



బళ్లారి రూరల్, జూలై 3: బళ్లారి ఎస్పీగా డాక్టర్ శోభారాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

ప్రస్తుతం బళ్లారి ఎస్పీగా వున్న రంజిత్ కుమార్ భండారి బెంగళూరుకు బదిలీ అయినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. ఆ స్థానంలో జిల్లా తొలి మహిళా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శోభారాణి ఇప్పటివరకూ బెంగళూరు నగరంతో పాటు మండ్య, హాసన్ తదితర ప్రాంతాల్లో సేవలందించారు. బళ్లారి ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆమెకు పోలీసు ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తమ వైద్యుడిగా డాక్టర్ ఈరణ్ణ



డాక్టర్ ఈరణ్ణ(ఫైల్)

సిరుగుప్ప, జూలై 3: ఉత్తమ వైద్యుడిగా డాక్టర్ ఈరణ్ణ ఎంపికయ్యారు. సిరుగుప్ప తాలుకా ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారిగా ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ఉత్తమ వైద్యుడిగా ఎంపిక చేసింది. డాక్టర్ ఈరణ్ణ కరోనా సమయంలో డెంగ్యూ వ్యాధి నివారించడంలో ముందడుగు వేశారు. అంతేకాకుండా ఎన్నికల సమయంలో ప్రతి రోజూ సేవలందించిన కారణంగా ఆయన సేవలను గుర్తించి ఉత్తమ వైద్యులుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తాలుకా ప్రజలు డాక్టర్ ఈరణ్ణను అభినందించారు.

అక్రమంగా సబ్సిడీ బియ్యం రవాణా



సబ్సిడీబియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

సిరుగుప్ప, జూలై 3 : అక్రమ సబ్సిడీ బియ్యాన్ని రవాణా చేస్తున్న పంపన్న అనే వ్యక్తిని అరెస్టు చేసి అతనివద్ద నుంచి తొమ్మిది క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సిరుగుప్ప తాలుకాలోని గోసబాళ గ్రామం వద్ద సబ్సిడీ బియ్యాన్ని అక్రమంగా గోడౌన్‌లో నిల్వ చేసిన కారణంగా ఆహారపౌరసరఫరాల అధికారి మహారుద్రగౌడ, మహేష్, శిరిగేరి పోలీసులు దాడి చేసి ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ సబ్సిడీ బియ్యం రవాణాకు పాల్పడిన పంపన్నను అరెస్టుచేశారు. ఈ మేరకు శిరిగేరి పోలీస్ స్టేషన్‌లో అతనిపై కేసు నమోదు చేశారు.

9న ధార్వాడలో కట్టడ కార్మికుల సమ్మేళనం



గోడపత్రికను విడుదల చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు

బళ్లారి సిటీ, జూలై 3: కట్టడ కార్మికుల సమస్యలపై చర్చించడానికి ఏఐఏయూటీసీ ఆధ్వర్యంలో ఈ నెల 9న ధార్వాడలో రాష్ట్రస్థాయి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమశేఖర్ పేర్కొన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, మొదట దార్వాడలో ప్రదర్శన నిర్వహించి, వివిధ జిల్లాల నుంచి కట్టడ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సహాయ ధనం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన కట్టడ కార్మికులకు రూ. 5లక్షలు ఆరోగ్య సేవకు ఖర్చుచేయాలని, పక్కాగృహాలకు రూ.5 లక్షలు సహాయధనం అందజేయాలని కోరారు. విద్యార్థుల కోసం చేసిన ల్యాప్‌టాప్‌ల కొనుగోళ్లలో పలు అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

నాగప్ప ఆలయం వద్ద చెత్తా చెదారం తొలగింపు



గుడి వద్ద ముళ్లకంపలను తొలగిస్తున్న దృశ్యం

కంప్లి, జూలై 3 : ఏళుపడగల నాగప్ప ఆలయం వద్ద రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలు భక్తులకు ఇబ్బందులు కలిగించడంతో అధికారులు ముందుకొచ్చి ముళ్లకంపలను తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామం నుంచి ఆలయం వరకు ముళ్లకంపలను తొలగించి మొక్కులు నాటి ఆలయానికి వచ్చే భక్తాదులను ఆకట్టుకునేలా చర్యలు చేపడతామని తెలిపారు.

పీడీఓలు బాధ్యతగా పనిచేయండి

పావగడ, జూలై 3 : తాలూకాలోని 34 గ్రామ పంచాయతీలలో వివిధ సమస్యలను ఎదుర్కొంటున్న ప్రజలకు పీడీఓలు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే వెంకటేశ్ సూచించారు. బుధవారం తాలూకా పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పీడీఓల ప్రగతి పరిశీలన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల కాలంలో ప్రతి పంచాయతీలోనూ పీడీఓల నుంచి అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని వాటిని అధిగమించడానికి ఈఓ జానకీరాం బాధ్యత వహించి పనిచేయాలన్నారు.

వరినాట్లకు సిద్ధమవుతున్న రైతులు

బళ్లారి సిటీ, జూలై 3: జిల్లాలోని వివిధ గ్రామాల్లో వరి నాట్లుకు ముందస్తు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. తుంగభద్ర నది, తుంగభద్ర కుడి కాలువ దిగువ లెవెల్, ఎగువ లెవెల్, విజయనగరం కాలువ, వివిధ చెరువుల



నాటడానికి సిద్ధంగా ఉన్న వరినారు

ఆయకట్టు కింద పొలాల్లో వరి నాట్లు వేసేందుకు దుక్కులు దున్నుకునే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సోనామసూరి, నెల్లూరు సోనా1010 (ఐఆర్-64)ఇప్పటికే కొంత భాగంలో విత్తారు. గొట్టపు బావుల ఆధారంగా సాగునీరు అందించే రైతులు వరినాట్లు వేయకముందే పొలంలో భూసారం కోసం జనుము, జీలుగ, పిల్లపెసర వంటి పచ్చిరొట్ట ఎరువులను పెంచుతున్నారు. రాంసాగర్, ముద్దాపూర్, కంప్లి కోట, సానాపూర్, ఇటగి, తాలూకాలోని గ్రామాలలో తుంగభద్ర కుడి దిగువ కాలువ కింద 8.870హెక్టార్ల విస్తీర్ణం సాగవుతుంది. తుంగభద్ర కుడి గట్టు ఎగువ కాలువ కింద సుమారు 6.174 హెక్టార్లలో పచ్చిరొట్ట పంటలు నాటారు. తుంగభద్ర జలాశయం నుంచి నీరు రాకపోవడంతో గత సీజన్‌లో ఒక పంట మాత్రమే సాగైంది. మార్కెట్లో వడ్లు బాగానే లభ్యమయ్యాయి. ఈ ఏడాది రుతుపవనాలు ఆశాజనకంగా ఉండడంతో రైతులంతా నిశ్చింతగా ఉన్నారు.

విత్తన శుద్ధి: వరి నారు చల్లకముందే ప్రతి కిలో విత్తనానికి తప్పనిసరిగా కార్బెండెజిమ్, మాంకోజెబ్ లాంటి శిలీంద్ర నాశనితో శుద్ధి చేసి వినియోగించాలని వ్యవసాయ అధికారి శ్రీధర్ సూచించారు.

కుడితిని ఫ్లైఓవర్ నిర్మాణంపై కేంద్ర మంత్రితో చర్చ

కంప్లి, జూలై 3 : బళ్లారి నూతన ఎంపీ తుకారామ్ ఎట్టకేలకు గత పది సంవత్సరాలుగా నిలిచిపోయిన కుడితిని ఫ్లై ఓవర్ పనులపై అక్కడ మంత్రితో చర్చించారు. అలాగే కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు మనవిపత్రం ఇచ్చారని కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో శ్రీరాములు, శాంత, దేవేంద్రప్ప ముగ్గురు ఎంపీలుగా ఉన్నా ఫ్లైఓవర్ పనులపై ఎలాంటి ఆసక్తి చూపలేదన్నారు. కుడితిని, కురుగోడు మార్గంలో రైల్వే ట్రాక్‌పై ఫ్లైఓవర్ పనులు ఆలస్యం కావడం వల్ల కొంతమంది రైతన్నలు, విద్యార్థులు కర్మాగారానికి వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. దీనిని దృష్టిలో వుంచుకుని కౌన్సిలర్లు వెంకటరమణ బాబు, కనికేరి పంపాపతి, పల్లెద ప్రభు, లెనిన్, పెద్దప్ప తదితరులు ఎంపీ తుకారాంను కలిసి ఈ విషయమై పార్లమెంట్‌లో చర్చించాలని మనవిపత్రం అందించినట్లు తెలిపారు. దీనిపై ఎంపీ స్పందించి ఆ అంశంపై రైల్వే శాఖ మంత్రితో చర్చించడం హర్షణీయమన్నారు. రైల్వే శాఖ మంత్రి త్వరలో ఆ పనులను చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



అర్ధంతరంగా నిలిచిపోయిన కుడితిని - కురుగోడు ఫ్లైఓవర్ పనులు

నేటి నుంచి రాజ్‌కుమార్ రోడ్డులో రాకపోకలు బంద్

బళ్లారి గాంధీనగర్, జూలై 3: రాయల్ సర్కిల్ నుండి సంగం వరకు గల రాజ్‌కుమార్ రోడ్డులో విస్తరణ పనులు జరుగుతున్న దృష్ట్యా 4వ తేదీ ఉదయం నుంచి రోడ్డు పనులు పూర్తి అయ్యేంతవరకు తాత్కాలికంగా వాహనాల రాకపోకలను బంద్ చేస్తున్నట్లు ప్రజా పనుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్ హేమరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వాహనాల రాకపోకలకు సంబంధించి ప్రత్యామ్నాయ వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాయల్ సర్కిల్ నుండి సంగమ్ సర్కిల్ వైపువెళ్ళే వాహనాలు కోర్టు రోడ్డు మార్గం గుండా వెళ్ళాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా సంగమ్ సర్కిల్ రాయల్ సర్కిల్ మీదుగా వెళ్ళాల్సిన వాహనాలు కెసి రోడ్డు-మీనాక్షి సర్కిల్ మీదుగా వెళ్ళాల్సి ఉంటుందన్నారు. రోడ్డు అభివృద్ధి జరుగుతున్న నేపథ్యంలో జిల్లా పాలనా మండలి, పోలీసు శాఖ సంయుక్తంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రోడ్డు పనులు పూర్తయ్యేవంత వరకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రెండు మార్గాలు మూసివేస్తే తీవ్రంగా నష్టపోతాం

రాయల్ సర్కిల్ నుండి సంగం సర్కిల్ వరకు గల మార్గాన్ని రెండువైపులా మూసివేస్తే తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుందని, వ్యాపారస్తులు వాపోతున్నారు. తాము నాలుగైదు దశాబ్దాలుగా ఇదే ప్రాంతంలో వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నామని, ఉన్న ఫళంగా రోడ్డును రెండువైపులా మూసివేస్తే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆ రోడ్డులోని హోటళ్ళు, మెడికల్ షాపులు,



రాయల్ సర్కిల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు

ఆసుపత్రులు, బ్యాంకులతో పాటు చిన్న చిన్న వ్యాపారాలు చేస్తున్న వారు పేర్కొంటున్నారు. అభివృద్ధికి తాము అడ్డుకాదని, అయితే ఉన్న ఫళంగా ఇరువైపులా రోడ్డును బంద్ చేస్తే వ్యాపారాల పరంగా తీవ్ర నష్టపోవాల్సి వస్తుందని, కనీసం వన్-వేలో వాహనాలు తిరిగేందుకు అవకాశం కల్పించాలని జిల్లాధికారికి బుధవారం వారు వినతిపత్రం అందజేశారు.

రైతులకు పాడిపరిశ్రమపై శిక్షణ



ఆవుల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కంప్లి, జూలై 3 : ధర్మస్థల గ్రామీణాభివృద్ధి బీసీ ట్రస్టు ఆధ్వర్యంలో రామసాగరంలోని 50 మంది రైతులకు బీజీకెర గ్రామంలో పాడిపరిశ్రమపై అవగాహన కల్పించారు. అక్కడ గొర్రెల పెంపకం, తేనె పెంపకం, సహజ ఎరువులు తదితర వాటిపై శిక్షణ ఇచ్చినట్లు చిత్రదుర్గ సంశోధకుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు ఇలాంటి సదుపాయాలను సద్వినియోగం చేసుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ వారు చేపట్టిన శిక్షణ ఇటు మహిళలకు అటు రైతన్నలకు కూడా ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సందీప్ కుమార్, రామసాగర రైతన్నలు పాల్గొన్నారు.

రాయచూరులో ఎయిమ్స్ ఏర్పాటు చేయాలి

● పోరాట సమితి కన్వీనర్ డాక్టర్ బసవరాజ్ కళస



నగరంలోని ఎంజీ స్టేడియంలో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు

రాయచూరు, జూలై 3 : విద్యాపరంగా అత్యంత వెనకబాటుతనానికి గురైన రాయచూరు జిల్లాకు ఎయిమ్స్ మంజూరు చేసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఎయిమ్స్ స్థాపక ఏర్పాటు కోసం సాగిస్తున్న ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డా.బసవరాజ్ కళస అన్నారు. ఎయిమ్స్ ఏర్పాటుతోనే జిల్లాకు తగిన న్యాయం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఎయిమ్స్ ఏర్పాటు కోసం అఖిల పక్షం, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్ష బుధవారం 783వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మహాత్మ గాంధీ స్టేడియంలోని దీక్ష శిబిరం వద్ద ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డా.బసవరాజ్ కళస మాట్లాడుతూ, ఇప్పటికే జిల్లాకు ఐఐటీ ఇస్తామని చెప్పిన పాలకులు దాన్ని ఇతర జిల్లాకు తరలించడం జిల్లా ప్రజలను తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటుకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులు ఏనాడు దీని పై నోరు విప్పకపోవడం బాధ్యత రాహిత్యమన్నారు. ఈ ప్రాంత ప్రజల పట్ల వారికున్న నిబద్ధతను వారి మౌనం తెలియజేస్తుందన్నారు. నాయకులకు ఎన్నికల పట్ల ఉన్న ధ్యాస అభివృద్ధి పై లేకపోవడం దౌర్భాగ్యమన్నారు. ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి విద్యసంస్థను రాయచూరులో ఏర్పాటు చేసి ఈ జిల్లాకు న్యాయం చేయాల్సిన పాలకులు కనీసం ఎయిమ్స్ ఏర్పాటు ద్వార పేదరికం ఎక్కువగా ఉన్న జిల్లాలో వైద్య సేవలకు విస్తృత అవకాశం కల్పించాలని కోరారు. ఇందుకోసం తమ పోరాట సమితి చేస్తున్న సుదీర్ఘ కాల పోరాటాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకుని ఈ ప్రాంత ప్రజల అవసరాన్ని గుర్తించి తగిన న్యాయం చేయాలన్నారు.

హోసూరు జోన్

ఆర్డినెన్స్ 243 రద్దుకు డిమాండ్



హోసూరులో నిరసన తెలుపుతున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు

హోసూరు, జూలై 3: హోసూరులో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఆర్డినెన్స్ 243 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిరసన తెలిపారు. ఆ ఆర్డినెన్స్ ప్రాథమిక విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు కౌన్సెలింగ్ ఉండాలని పేర్కొంటోంది. అయితే ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల్లో దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ఈ ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా టీచర్లు నిరసనలకు సిద్ధమయ్యారు. ఫెడరేషన్ ఆఫ్ తమిళనాడు ప్రైమరీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్స్ పిలుపుతో హోసూరు జిల్లా ప్రాథమిక విద్యాశాఖ కార్యాలయం సమీపంలోని ఆర్‌వీ ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాలలో ప్రాథమిక విద్యాశాఖ ఉపాధ్యాయులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తమిళనాడు ఉపాధ్యాయ సమాఖ్య కృష్ణగిరి జిల్లా కార్యదర్శి పౌండర్ల మీడియాతో మాట్లాడుతూ ఆర్డినెన్స్ వల్ల వేలాది మంది ఉపాధ్యాయులపై ప్రభావం ఉంటుందని కేవలం 10 శాతం ఉపాధ్యాయులకు ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన కేసు కోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పుడు బదిలీల కౌన్సెలింగ్ అవసరం ఏమిటని ప్రశ్నించారు. పదోన్నతి విషయం తేలితేనే బదిలీల గురించి ఆలోచిస్తామన్నారు.

డాక్టర్ కిరణ్ టీహెచ్ఓగా రావడం దురదృష్టకరం

పావగడ, జూలై 3 : ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్నో అఘాయిత్యాలు, అక్రమాలు, హత్యలకు కారణమైన డాక్టర్ కిరణ్‌ను పావగడ ప్రజలు, అధికారులు వైద్య వృత్తి నుంచి బహిష్కరించినా ఆయనను మళ్లీ తుమకూరు జిల్లా పావగడ తాలూకా వైద్యాధికారిగా నియమించడం దురదృష్టకరమని పావగడ దళిత సంఘం నాయకులు, స్వచ్ఛంద సేవాసంస్థ రైతు సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు. డాక్టర్ కిరణ్ తండ్రి గోవిందప్ప గన్ నుంచి 1986లో పావగడ పోలీసులు జరిపిన ఫైరింగ్‌లో ఆరుగురు అమాయకులు మృత్యువాత పడ్డారని, ఇదే కిరణ్ సారథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఏడుగురు మహిళలకు శస్త్ర చికిత్స చేయగా వారిలో ముగ్గురు మహిళలు మృత్యువాత పడటం విచారకరమన్నారు

జన్యు లోపాలపై అవగాహన

హోసూరు, జూలై 3: హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ మిడిల్ స్కూల్‌లో జన్యు లోపం వల్ల వచ్చే వ్యాధుల గురించి దాని లక్షణాల గురించి ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈమేరకు సంబంధిత వైద్య చికిత్సలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రాంతీయ వైద్యాధికారి అఖిల, వైద్యాధికారిణి కార్తీక సహ వైద్యబృందం పాల్గొన్నారు. అలాగే శిబిరంలో రక్తహీనత సమస్యపై బాధపడుతున్న కొందరు విద్యార్థులనుంచి రక్త నమూనాలు సేకరించి ధర్మపురి మెడికల్ కళాశాల ఆసుపత్రికి పంపించారు.



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఫీజుల దోపిడీని నియంత్రించాలి

● పీడీయూసీ రాష్ట్ర కన్వీనర్ అజీజ్ జాగీర్‌దార్



డీసీ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న అజీజ్ జాగీర్‌దార్

రాయచూరు, జూలై 3 : పీయూసీ కోర్సులు బోధించే కళాశాలల్లో ఇంటిగ్రేటెడ్ కోర్సుల పేరుతో ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీయూసీ రాష్ట్ర కన్వీనర్ అజీజ్ జాగీర్‌దార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన జలాల్, జిల్లాతో పాటు రాష్ట్రంలోని అనేక పీయూ కళాశాలల్లో ట్రిబుల్ ఐటీ, ఐఐటీ, సీఈటీ తదితర కోర్సుల పేరుతో వంద శాతానికి మించి ఫీజులను పెంచారని ఆరోపించారు. గతంలో 1983 విద్య ఫీజుల నియంత్రణ యాక్ట్ ఆధారంగా కళాశాలలపై చర్యలు తీసుకునే అవకాశం ఉండగా ప్రస్తుతం ప్రభుత్వం ఫీజుల నియంత్రణపై ఏ మాత్రం దృష్టి సారించకపోవడం బాధ్యతరాహిత్యమన్నారు. ఫీజుల మోతను భరించలేక అర్హులైన అనేక మంది విద్యార్థులు ముఖ్యంగా గ్రామీణ, నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు సాంకేతిక ఇతర ఉన్నత విద్యలకు దూరమయ్యే దుస్థితి తలెత్తిందన్నారు. దీనిపై అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని లేని పక్షంలో తమ యూనియన్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక్ష ఆందోళనకు దిగుతుందని హెచ్చరించారు.

తాగునీటి స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించాలి

రాయచూరు, జూలై 3 : జిల్లాలో తాగునీటి సరఫరా విషయంలో పంచాయతీ అభివృద్ధి అధికారులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వే సూచించారు. కలుషిత నీరు తాగడం వల్ల గడచిన రెండేళ్లలో అనేక గ్రామాల్లో సమస్యలు తలెత్తిన నేపథ్యంలో అలాంటివి పునరావృతం కాకుండా పీడీఓలు ముందుజాగ్రత చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ, నగర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు సంబంధించి క్లోరినేషన్‌ను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పీడీఓలు పరిశీలించాలన్నారు. ఇందుకు సబంధించి బుధవారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో మూడు తాలూకాల పీడీఓలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. నీటి శుద్ధీకరణ కిట్‌లను అందజేసిన అధికారులు నీటిని పరీక్షించే విధానం, ఫలితాన్ని వెంటనే పొందే అవకాశం తదితర వాటి గురించి పీడీఓలకు వివరించారు. సమావేశంలో మాట్లాడిన జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వే, వర్షకాలం ప్రారంభమై తాగునీటి ఎద్దడి లేకపోయినా కొన్ని చోట్ల సరఫరాలో నీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారన్నారు. కనుక నీటి స్వచ్ఛత పై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పరిశీలన జరపాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

స్వామి వివేకానంద (వర్ధంతి)




అమెరికా దేశం చికాగోలో జరిగిన ప్రపంచ ధర్మ సమ్మేళనంలో 'సోదర సోదరీ మణులారా...' అంటూ సంబోధించి హిందూధర్మ గొప్పదనాన్ని చాటిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద 1863 జనవరి 12న కోల్కత్తాలో జన్మించారు. హిందూధర్మ ఉద్ధరణకు పాటుపడడమే కాక యోగాను ప్రపంచానికి చాటిన ఆయన అసలు పేరు నరేంద్రనాథ్ దత్తా. హిందూ సాధువు, తత్వవేత్త. గురువు రామకృష్ణ పరమహంస పేరిట మఠాన్ని, మిషన్‌ను స్థాపించారు. వందలాది సదస్సులలో ప్రసంగించి యువతను చైతన్య పరిచారు. 1902 జూలై 4న కన్నుమూశారు. కాగా ఆయన జయంతిని జాతీయ యువదినోత్సవంగా ఆచరిస్తున్నారు.

పింగళి వెంకయ్య (వర్ధంతి)



దేశ జాతీయపతాక రూపకర్త పింగళి వెంకయ్య 1876 ఆగస్టు 2న కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జన్మించారు. స్వాతంత్ర్య సమర యోధుడిగాను, విద్యావేత్తగాను గుర్తింపు పొందారు. ఎంతోమంది పతాకాలు రూపొందించినా పింగళి రూపొందించిన పతాకాన్ని మహాత్మా గాంధీజీ సూచన మేరకు త్రివర్ణ పతాకంలో రాట్నం చిహ్నంకు బదులుగా అశోకచక్రం చిహ్నంతో 1947లో ఖరారు చేశారు. నిరాడంబర, నిస్వార్థ జీవితం గడిపిన ఆయన 1963 జూలై 4న కన్నుమూశారు.

కె.రోశయ్య (జయంతి)



డాక్టర్ కొణిజేటి రోశయ్య 1933 జూలై 4న గుంటూరు జిల్లా తెనాలి ప్రాంతంలో జన్మించారు. 2009 నుంచి 2010 మధ్య ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రిగా, 2011 నుంచి 2016 మధ్య తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా వ్యవ హరించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ సహా వివిధ హోదాలలో కొనసాగారు. ప్రత్యేకించి ఆర్థికమంత్రిగా గుర్తింపు పొందారు. 2007లో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 2021 డిసెంబరు 4న కన్నుమూశారు.

ఉమా రామారావు (జయంతి)



ప్రముఖ కూచిపూడి నృత్య కారిణి కే ఉమా రామారావు 1938 జూలై 4న విశాఖ పట్నంలో జన్మించారు. కొరియో గ్రాఫర్‌గా, పరి శోధకులుగా, రచయితగా రాణించారు. త్యాగరాజ గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ అండ్ అకాడమీలో సీనియర్ లెక్చరర్‌గా వ్యవహరించారు. తదుపరి హైదరాబాద్‌లో 1985లో ఏర్పాటైన లాస్యప్రియ డ్యాన్స్ అకాడమీ సంస్థాపకులు, డైరెక్టర్‌గా కొనసాగారు. కళా నీరాజనం, కళాప్రపూర్ణ, ప్రతిభా పురస్కారం, సంగీత నాటక అకాడమీ పుర స్కారం తదితర గౌరవాలు అందుకున్నారు. 2016 ఆగస్టు 27న కన్నుమూశారు.

ఎంఎం కీరవాణి (పుట్టినరోజు)



ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి 1961 జూలై 4న పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరులో జన్మించారు. పూర్తి పేరు కోడూరి మరకతమణి కీరవాణి. 1989 నుంచి సంగీత దర్శకుడిగానే కాక గాయ కుడిగా, స్వరకల్పనలోనూ, గేయ రచనలోనూ గుర్తింపు పొందారు. ప్రత్యేకించి 'అన్నమయ్య' సినిమాకు ఉత్తమ సంగీత దర్శకుడి పురస్కారం అందుకున్నారు. 8 ఫిల్మ్‌ఫేర్, 11 నంది అవార్డులు పొందారు. తెలుగు సహా ఇతర భాషలలో కలిపి 220కు సినిమాలకు సంగీతం అందించారు. 2022లో ఆర్ఆర్ఆర్ సినిమాలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు దక్కింది. 2023 లో 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్నారు.

కరవే తాలూకా అధ్యక్షుడిగా మునిరాజు



కరవే అధ్యక్షుడు నారాయణగౌడతో మునిరాజు

శిడ్లఘట్ట, జూలై 3: కర్ణాటక రక్షణా వేదిక (కరవే) తాలూకా అధ్యక్షుడిగా మునిరాజు (కుట్టి) నియమితులయ్యారు. ఈమేరకు మునిరాజు మాట్లాడుతూ కరవే రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ సూచనతో చిక్కబళ్ళాపుర జిల్లా ఎంఆర్ లోకేశ్ తనకు నియామకపత్రాన్ని అందచేశారన్నారు. 15ఏళ్లుగా సంఘం సభ్యుడిగా పోరాటాల్లో పాల్గొన్నానన్నారు. కర్ణాటకలో కన్నడయే సార్వభౌమ అనే నినాదంతో భాషా సంస్కృతుల పరిరక్షణకు సంఘం కృషి చేస్తోందన్నారు. తనకు అవకాశం కల్పించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైలు కిందపడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్య

బెంగళూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రైలుకిందపడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన కలబురగి నగరం బిద్దాపుర కాలనీవద్ద మంగళవారం జరిగింది. బాపుగౌడ (45) ఆత్మహత్య చేసుకున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్. కలబురగి నగర పోలీస్ కమిషనరేట్‌లో వైర్‌లెస్ విభాగంలో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా నోటి కేన్సర్‌తో ఆయన బాధపడు తున్నారు. మానసికంగా ఇబ్బంది పడుతున్న ఆయన ఇదే కారణంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు భావించారు. మృతదేహాన్ని కలబురగి జిల్లాసుపత్రికి తరలించారు. వాడి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కళాశాల అంటే వ్యక్తిత్వ నిర్మాణ ఆలయం

» కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ శోభ



బహుమతుల ప్రదానంలో ప్రముఖులు

బెంగళూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కళాశాల అంటే భారీ భవనాలు కాదని వ్యక్తిత్వ నిర్మాణ ఆలయమని కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ శోభ అభిప్రాయపడ్డారు. నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వార్షికోత్సవం జరిగింది. విద్యార్థులను ఉద్దేశించి డాక్టర్ శోభ మాట్లాడుతూ విద్య, వృత్తిమార్గదర్శకం, పోటీ పరీక్షలకు శిక్షణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఇక్కడి కళాశాలలో నిరంతరంగా కొనసాగడం సంతోషకరమన్నారు. కేవలం పాఠ్యాంశాలే కాకుండా సమాజం గురించి తెలుసుకోవాలని అధ్యాపకుల మార్గదర్శకాలు కీలకమన్నారు. ఆధునిక జ్ఞానంతో ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు ప్రముఖ నటుడు సుందర్‌రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అరచేతిలో ప్రపంచం అనేకాలం వచ్చిందన్నారు. సమాచారమే శిక్షణ అనేది సరైన ఆలోచన కాదన్నారు. సామాజిక అంశాలు, క్రమశిక్షణ, ధ్యేయం, పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని విద్యార్థులు అలవరచుకోవాలన్నారు. ఇక్కడి క్రీడా విభాగం, కన్నడ కళాసంఘం, చేపట్టే కార్యక్రమాలు సంతోషమన్నారు. జానపద ప్రదర్శన, కళలను నేర్పిన హిదాయత్ అహ్మద్‌ను ప్రత్యేకంగా సన్మానించారు. డిగ్రీ చదివే విద్యార్థులు సాంకేతిక విద్యలపై ఆలోచిస్తున్నారని ఇక్కడి కళాశాలలో మన జానపద సంప్రదాయమైన డొళ్ళు కుణిత, కంసాలె, కోలాటం వంటివి నేర్చుకోవడం సంతోషమన్నారు. విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ పీటీ శ్రీనివాసనాయక బహుమతులు ప్రదానం చేశారు. ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆనంద్, సాంస్కృతిక కమిటీ సంచాలకులు డాక్టర్ శశికళ ముఖ్యులుగా పాల్గొనగా కన్నడ సంఘం సంచాలకులు డాక్టర్ రుద్రేశ్ అదరంగి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

స్టార్టప్, ఎంఎస్ఎంఈల ప్రగతికి సహకారం

బెంగళూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలతోపాటు విద్యుత్ ఉత్పత్తి, ఎలక్ట్రానిక్ రంగంలో బెంగళూరు మినహా ఇతర నగరాలలోనూ ప్రగతికి సహకారం అందిస్తున్నామని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) రాష్ట్ర విభాగం అధ్యక్షులు ఎన్ వేణు అభిప్రాయపడ్డారు. సీఐఐ కర్ణాటక విభాగం 2024-25 భవిష్యత్ అంచనాలను మీడియాకు వివరించారు. రాష్ట్ర అధ్యక్షులు, హిటాచి ఎనర్జీ ఎండీ వేణు మాట్లాడుతూ సీఐఐ కర్ణాటక ప్రపంచస్థాయిలో పోటీపడుతోందన్నారు. సుస్థిరత, అంతర్గత అభివృద్ధి కోసం భాగస్వామ్యం పెంచుకోదలిచారు. బియాండ్ బెంగళూరులో భాగంగా మైసూరు, మంగళూరు, హుబ్బళ్ళి ధారవాడ నగరాలలోనూ అభివృద్ధి చేయదలిచామన్నారు. 2030 నాటికి సంప్రదాయేతర ఇంధన వనరులు 50శాతం ప్రగతి సాధ్యం చేస్తామన్నారు. సమాఖ్య ఉపాధ్యక్షులు రవీంద్ర శ్రీకంఠన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ



స్మార్ట్‌ఫోన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి, జూలై 3: డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునేలా నైపుణ్యం పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి అభిప్రాయపడ్డారు. అత్యాధునిక సాంకేతిక విధానాలతో అరచేతిలోనే సమాచారం పొందవచ్చునన్నారు. పట్టణంలోని దేవరాజ్ అరసు భవనంలో బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో స్త్రీ శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన కింద అంగన్‌వాడీ కార్యకర్తలకు స్మార్ట్‌ఫోన్లు, అర్హులకు భాగ్యలక్ష్మిబాండ్లు, ఆరోగ్యకిట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పలు పథకాల అమలులో అంగన్‌వాడీల పాత్ర కీలకమన్నారు. స్త్రీశిశు సంక్షేమపథకం అధికారి కేవీ రామచంద్ర మాట్లాడుతూ తాలూకాలో 384 అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులకు పోషణ్ అభియాన కింద మొబైల్ హ్యాండ్‌సెట్‌లు, 570 భాగ్యలక్ష్మి బాండ్లు, 384 ఆరోగ్య కిట్‌లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. సాంకేతికంగా కొంతమందికి పంపిణీ చేస్తున్నామన్నారు. గర్భిణీలు, బాలింతలకు సరఫరా చేసే పౌష్టికాహార పదార్థాల వివరాలను యాప్ ద్వారా నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. తద్వారా పోషణ్ అభియాన ప్రగతి సమీక్ష సులభతరం కానుందన్నారు. ఇందుకు సంబంధించి మొబైల్ వాడకం గురించి ఇప్పటికే కార్యకర్తలకు తర్ఫీదు ఇచ్చినట్టు తెలిపారు. పోషణ్ ట్రాక్టర్ యాప్‌లో ఆయా కేంద్రాలలో దైనందిన కార్యక్రమాలు, గర్భిణి, బాలింత, పిల్లల చేరిక, హాజరు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, స్వచ్ఛత పాటింపు తదితర అంశాలకు సంబంధించి నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో తాలూకా ఆరోగ్య అధికారులు డాక్టర్ సీఎన్ సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘునాథరెడ్డి, నరసింహప్ప, బీవీ వెంకటరవణ, అంగన్‌వాడీ అధికారి అనసూబాయ్, బసవ్వ, చైతన్య, రాధికా, సుజాతా తదితరులు పాల్గొన్నారు.

కేఆర్ఎస్‌కు నూతన కార్యవర్గం



నూతన పదాధికారులు

దొడ్డబళ్ళాపుర, జూలై 3: అవినీతి రహిత సమాజమే లక్ష్యమని ప్రతి గ్రామంలోనూ కర్ణాటక రాష్ట్ర సమితి (కేఆర్ఎస్) పార్టీని విస్తరింపచేయనున్నట్టు బెంగళూరు గ్రామీణ జిల్లా నూతన అధ్యక్షుడు శివశంకర్ తెలిపారు. పట్టణంలోని ప్రవాసిమందిరంలో బుధవారం పార్టీ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా సమితి కార్యవర్గానికి ఇన్‌చార్జ్ గజేంద్రగౌడ అధ్యక్షత వహించారు. బెంగళూరు గ్రామీణ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా బీ శివశంకర్ ఎంపికయ్యారు. గౌరవాధ్యక్షులుగా వెంకటేశ్‌మూర్తి జిల్లా అధ్యక్షులుగా బీ శివశంకర్, ఉపాధ్యక్షులుగా అరుణ్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా ఆనంద్ నారనహళ్ళి, కార్యదర్శిగా రమేశ్, శశికుమార్, వేణు, సుబ్రమణ్య, రామకృష్ణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్‌లు తదితరులు పాల్గొన్నారు.

బసవాపట్టణలో చౌకడిపో ప్రారంభం



చౌకడిపో ప్రారంభంలో ప్రముఖులు

శిడ్లఘట్ట, జూలై 3: తాలూకాలోని మళమాచనహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని బసవాపట్టణలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న చౌకడిపో ఎట్టకేలకు ఆరంభమైంది. కాంగ్రెస్ నాయకుడు బీఎన్ భైరేగౌడ మాట్లాడుతూ కరోనా వేళ అన్నభాగ్య ద్వారా సామాన్యులను ఆదుకుందన్నారు. ఎంతోకాలంగా రేషన్‌కోసం ఇబ్బందులు పడేవారమని కనీసం కిలోమీటరు దూరంలోని మళమాచనహళ్ళిలోని చౌకడిపోకు వెళ్లాల్సి ఉండేదన్నారు. దీంతో కూలీ కార్మికులు రేషన్‌కోసం ఎంతో ఇబ్బంది పడేవారన్నారు. ఒక్కోసారి సర్వర్ సమస్యతో మరోసారి వెళ్లాల్సి ఉండేదన్నారు. పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి కేహెచ్ మునియప్ప, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎంసీ సుధాకర్‌ల సహకారంతో గ్రామంలో చౌకడిపోను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న చౌకడిపో గ్రామంలో ఏర్పాటు కావడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మునేగౌడ, డైరెక్టర్ దేవరాజ్, అంగడి గోపాల్, రామకృష్ణప్ప, చన్నకేశవ, సంతోష్, ముఖ్యకార్యనిర్వాహకురాలు ఉషారాణి, పెద్దసంఖ్యలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ



స్మార్ట్ ఫోన్లతో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎమ్మెల్యే తదితరులు

దొమ్మసంద్ర, జూలై 3: స్త్రీశిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆనేకల్ తాలూకా పరిధిలో అవసరమైన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు బుధవారం భూమిపూజ చేశారు. ఇదే సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులకు స్మార్ట్‌ఫోన్‌లు, మెడికల్ కిట్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బీ శివణ్ణ ఆనేకల్ పట్టణంలోని 21వ వార్డులోని సత్యనారాయణ లే అవుట్‌లో అంగన్‌వాడీ కేంద్రానికి భూమిపూజ చేశాక, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో రెండు తరగతి గదులను ప్రారంభించారు. అనంతరం రామకుటీరలో ఏర్పాటైన కార్యక్రమంలో అంగన్‌వాడీలకు 523 స్మార్ట్‌ఫోన్‌లు, మెడికల్ కిట్‌లను పంపిణీ చేశారు. స్త్రీశిశుసంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సిద్ధరామణ్ణ, సీడీపీఓ కవితా, పురసభ మాజీ అధ్యక్షుడు ఎన్ఎస్ పద్మనాభ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి ఖైదీ నంబరుతో ఫొటో షూట్



వైరల్ అయిన ఫొటో ఇదే..

బెంగళూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నటుడు దర్శన్‌పై అభిమానం దారి తప్పేలా మారుతోంది. ఇప్పటికే ద్విచక్ర వాహనాలపై ఖైదీ నెంబరు 6106 రాసుకోవడంపై పోలీసులు షాక్ ఇచ్చారు. మరువకముందే అభిమాన దంపతులు తమ చిన్నారికి 6106 నెంబరు కల్గిన డ్రెస్ వేసి ఫోటోషూట్ చేశారు. నెలలు నిండని చిన్నారికి ఓ తెల్లటి షర్టు వేసి దానిపై 6106 నెంబరు నమోదు చేసి ఫోటోలు తీశారు. ఇందుకు సంబంధించి సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో బాలల హక్కుల కమిషన్ తల్లిదండ్రులకు నోటీసు జారీ చేసేందుకు సిద్ధమైంది. హక్కుల ఉల్లంఘన రుజువైతే ఆరు నెలల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా తప్పదని బాలల హక్కుల రక్షణా కమిషన్ సభ్యుడు శశిధర్ కొసంబె తెలిపారు.

రోగ నిర్ధారణకు అత్యాధునిక సౌలభ్యం

బెంగళూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వేగవంతంగా రోగ నిర్ధారణ జరిపేందుకు అత్యాధునిక సౌలభ్యాలతో వెల్‌నెక్స్ ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చామని డైరెక్టర్ అజయ్‌సింహ వెల్లడించారు. ఆరోగ్యరంగంలో కొత్త విధానాలు మా ఆశయమన్నారు. హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో ప్రత్యేక ల్యాబ్‌ను ప్రారంభించామని మొబైల్ ద్వారా నగర వ్యాప్తంగా సేవలు ఉంటాయన్నారు. వెల్‌నెక్స్ నగరంతోపాటు సమీప ప్రాంతాల ప్రజలకు వీలుగా ఏర్పాటు చేశామన్నారు. పాయింట్ ఆఫ్ కేర్ డయాగ్నస్టిక్స్, ప్రాసెసింగ్ ల్యాబ్‌లు గంట వ్యవధిలో వంద పరీక్షలు జరిపే సౌలభ్యాలు ఉన్నాయన్నారు. వెల్‌నెక్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తుందన్నారు. సకాలంలో రోగ నిర్ధారణ చేస్తే చికిత్సలు సులభతరం అవుతాయన్నారు.

చెరువులోకి దూకి ప్రేమికుల ఆత్మహత్య



శ్రీకాంత్, అంజన (ఫైల్)

బెంగళూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర తలఘట్టపుర పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రేమికులు చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెలుగులోకి వచ్చింది. కోణనకుంటె ప్రాంతానికి చెందిన శ్రీకాంత్ (25), అంజనాపుర నివాసి అంజన (20)లు ఆత్మహత్యకు పాల్పడినవారు. శ్రీకాంత్ బీకామ్ ఫైనలియర్ చదువుతుండగా కొంతకాలంపాటు అతను చదువు మానేసి ఇప్పటికే వివాహం చేసుకున్నాడు. ఓ వైపు ఆటో నడుపుతూ కళాశాలకు వస్తున్నాడు. అంజనా బీబీఏ కోర్సు చదువుతున్నారు. వీరు రెండేళ్లుగా ప్రేమలో ఉన్నారు. ఇంట్లో వీరి ప్రేమ వ్యవహారం తెలియడంతో మందలించారు. ఇప్పటికే పెళ్లి కాగా ప్రేమ అంటూ ఇబ్బంది పెట్టడం సరికాదని ఇరుకుటుంబాలవారు మందలించారు. దీంతో ఇల్లు వదిలిపెట్టి పోవాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరూ వారిళ్లలో డెత్‌నోట్‌లు రాసి మా చావుకు ఎవరూ కారణం కాదని పేర్కొని ఇల్లు విడిచారు. శ్రీకాంత్ కనిపించడం లేదని కుటుంబీకులు కోణనకుంటె పోలీస్ స్టేషన్‌లోనూ, అంజన కుటుంబీకులు తలఘట్టపుర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం మధ్యాహ్నం నైస్‌రోడ్డుకు అనుబంధంగా ఉన్న తులసీపుర చెరువులో రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. ఒకరికొకరు చేతులకు దారం కట్టుకుని చెరువులోకి దూకినట్టు పోలీసులు గుర్తించారు. కెంపేగౌడ ఆసుపత్రికి మృతదేహాలను తరలించారు. తదుపరి దర్యాప్తు సాగుతోంది.

కళాశాలలో బిడ్డకు జన్మనిచ్చిన పీయూ విద్యార్థిని

» నిందితుడిని అరెస్టు చేసిన కోలారు పోలీసులు

బెంగళూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్రీ యూనివర్సిటీ (పీయూ) తొలి సంవత్సరం విద్యార్థిని కళాశాలలోనే మగబిడ్డకు మంగళవారం జన్మనిచ్చిన సంఘటన జిల్లా కేంద్రమైన కోలారులో చోటు చేసుకుంది. తీవ్రమైన కడుపునొప్పి రావడంతో విద్యార్థిని బాత్రూంకు వెళ్లారు. అక్కడే శిశువు జన్మించారు. కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది వెంటనే విద్యార్థినిని ఆసుపత్రికి తరలించారు. కోలారు మహిళా పోలీసులు రంగప్రవేశం చేసి విద్యార్థిని నుంచి సేకరించిన వివరాల ఆధారంగా పోక్సో కేసు నమోదు చేసి అనిల్‌కుమార్(21)ను అరెస్టు చేశారు. బాలిక పదోతరగతి చదువుతున్న వేళ ప్రేమిస్తున్నానని నమ్మించి అత్యాచారం చేశాడు. ఆ తర్వాత బెదిరించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. నిరంతర చర్యతో బాలిక గర్భం దాల్చింది. అయితే బాలిక గర్భం దాల్చిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియకుండా రహస్యంగా ఉంచడం ఆశ్చర్యం అనిపిస్తోంది. కోలారు మహిళా పోలీసులు సమగ్ర విచారణ జరుపుతున్నట్టు తెలిపారు.

కళాశాల గార్డును హత్య చేసిన విద్యార్థి

బెంగళూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కళాశాల లోపలికి వదలలేదని ఓ విద్యార్థి ఏకంగా సెక్యూరిటీ గార్డును చాకుతో పొడిచి హత్య చేశాడు. నగరంలోని అమృతహళ్ళిలో ఉండే ఓ కళాశాలలో బుధవారం సంఘటన చోటు చేసుకుంది. భార్గవ్ అనే విద్యార్థి సెక్యూరిటీగార్డు జైకిశోర్ రాయ్‌ను చాకుతో పొడిచాడు. అంబులెన్స్ వచ్చేసరికే తీవ్ర రక్తస్రావమై అక్కడే మృతి చెందాడు. కళాశాల లోపలికి వదలలేదనే కారణంతో విద్యార్థి చాకుతో పొడిచాడు. అతడు మద్యం మత్తులో ఉన్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆరోపితుడిని అమృతహళ్ళి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

బెంగళూరులో పైశాచికం... ఆరేళ్ల బాలికపై హత్యాచారం

బెంగళూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో పైశాచిక ఘటన వెలుగు చూసింది. ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసి దారుణంగా హత్య చేసిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. నగర నడిబొడ్డున మెజస్టిక్‌లోని క్రాంతివీర సంగొళ్లిరాయణ్ణ రైల్వేస్టేషన్‌లో దుర్మార్గ సంఘటన చోటు చేసుకుంది. కూలి పనులు చేసుకుని జీవిస్తున్న కుటుంబానికి చెందిన ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసి ఆ తర్వాత హతమార్చి మృతదేహాన్ని పడేశారు. బాలిక శరీరంపై గాయాలు, బట్టలపై రక్తపు మరకలు ఉన్నట్టు గుర్తించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. ఉప్పారపేట పోలీసులు దర్యాప్తు ఆరంభించారు. స్థానికంగా ఈ ఘటన కలచివేసింది. సమాజంలో మానవసంబంధాలు దెబ్బతినడం బాధ కలిగిస్తోంది. చిన్నారులపట్ల అమానుషాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. మార్పుకు కనీస చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంటికి సౌర వెలుగులు

అనంతపురంరూరల్, జూలై 3: విద్యుత్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. విద్యుత్ బిల్లుల భారం తగ్గేలా పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనను ప్రకటించింది. ఇళ్లకు తగిన సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇంటి పైకప్పునకు వీటిని అమర్చి, దీని ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు. గృహ అవసరాలకు సరిపోగా మిగిలిన విద్యుత్‌ను డిస్కంలకు అమ్ముకునేలా వీలు కల్పించింది. ఈక్రమంలోనే ఆసక్తిగల వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఏపీ ఎస్పీడీసీఎల్ సంస్థ సమన్వయంతో పలు సోలార్ కంపెనీలు వీటిని ఏర్పాటు చేస్తున్నాయి.

దరఖాస్తు ఇలా..

తొలుత వినియోగదారులు www/pmsuryaghar.gov.in. వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. ఆరు నెలలకు సంబంధించి విద్యుత్ బిల్లులను దరఖాస్తుకు జతచేయాలి. వ్యక్తిగత నివాసం నమూన, గృహ కామన్ సర్వీసుదారులకు ఈ పథకం వర్తిస్తుంది. 1 కే.వీ. సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేయడానికి ఇంటి పైకప్పు మీద 10చ.మీ.స్థలం అవసరం ఉంటుంది. 1కేవీ కెపాసిటీ కోసం 3 నుంచి 4 సోలార్ ప్యానెళ్లను 1మీటర్ వెడల్పు, 1.6 మీటర్ల ఎత్తుతో అమర్చుతారు. 1కేవీ కెపాసిటీ సోలార్ ప్యానల్ ఏర్పాటుకు రూ.80వేలు అవుతుంది. ఇందులో వినియోగదారులకు రూ.30 వేల సబ్సిడీ వస్తుంది. 2కేవీ కెపాసిటీ ప్యానల్‌కు రూ.1.5లక్షలు కాగా..రూ.60వేలు సబ్సిడీ వస్తుంది. 3కేవీకిపైగా ఎంత కిలో వ్యాట్స్ తీసుకున్నా..రూ.78వేలు సబ్సిడీ అందుతుంది. దరఖాస్తు సమయంలోనే సోలార్ ఏర్పాటు కంపెనీలకు సంబంధించిన 13ఏజెన్సీల వివరాలు ఉంటాయి. దరఖాస్తుకు డిస్కమ్ క్లియరెన్స్ ఇచ్చిన తరువాత వినియోగదారులు నమోదు చేసుకున్న ఏజెన్సీ వారు రూఫ్‌టాప్‌ను ఇన్‌స్టాల్ చేస్తారు. తర్వాత వినియోగదారుడు నెట్ మీటర్ కోసం విద్యుత్ శాఖకు దరఖాస్తు చేసుకోవాలి. ఇంటి సర్వీసుకు నెట్ మీటర్ అమర్చిన తరువాత వినియోగదారుడు ఆ పోర్టల్‌లో తన బ్యాంకు ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాలి. ఆ తరువాత రాయితీ సొమ్ము 30 రోజుల్లో జమచేస్తారు.



ఉపయోగాలు ఇవి..

1కేవీ సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్ నెలకు 125యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు 150-200యూనిట్ల మధ్య వినియోగం ఉంటుంది. 1కేవీ సోలార్ ప్యానెల్ ఏర్పాటుతో కనీస విద్యుత్ బిల్లులను పొందేందుకు వీలుంటుంది. అంతేకాకుండా సోలార్ ప్యానళ్లు సూర్యుని వేడిని తీసుకోవడం ద్వారా ఇంటిలోపల చల్లగా ఉండేందుకు వీలుంటుంది. దీనికితోడు వినియోగదారుడు 5 నుంచి 6ఏళ్ల లోపు మూలధన వ్యయాన్ని తిరిగి పొందేందుకు అవకాశం ఉంటుంది.